క్లుప్తంగా

అశ్వవాహనంపై మూలస్థాన ఎల్లమ్మ



చంద్రగిరి: గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ బుధవారం అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి అశ్వవాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఉభయదారులుగా పాకాల వంశస్తులు వ్యవహరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం చేపట్టారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి ఉగాది పురస్కారం



తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలలోని అగ్రానమీ విభాగపు ప్రొఫెసర్ జి.కృష్ణారెడ్డికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉగాది పురస్కారం అందించింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం గుంటూరులోని లాంఫామ్‌లో నిర్వహించిన ఉగాది పురస్కార ప్రదానోత్సవంలో వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

సేవాదళ్ రీజినల్ కోఆర్డినేటర్‌గా రాజేంద్ర



చిత్తూరు రూరల్: యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ (వైఎస్సార్ సీపీ) పార్టీ సేవాదళ్ రీజినల్ కోఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన తలారి రాజేంద్రను నియమించినట్లు రాష్ట్ర అనుబంధ సంఘాల కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన తిరుపతి, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల రీజినల్ కోర్డినేటర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని బుధవారం ఎమ్మెల్యే పేర్ని నాని, సినీ నటుడు సాయివెంకట్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగను పంపిణీ చేస్తున్న ఈస్ట్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ శివప్రసాద్‌రెడ్డి, అంజి

తిరుపతి మంగళం: వేసవిలో ప్రజలకు తాగునీరు అందించడం అభినందనీయమని తిరుపతి ఈస్ట్ డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహం కూడలిలో చిల్లీస్ రెస్టారెంట్ అధినేత అంజి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బుధవారం ఈస్ట్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. తిరుపతి ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు తిరుపతిలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గాంధీ విగ్రహం కూడలి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు శ్రీవారి భక్తులతో నిత్యం రద్దీగా ఉంటాయని పేర్కొన్నారు. నగర ప్రజలతో పాటు శ్రీవారి భక్తులకు తాగునీటికి చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్ మురళి పాల్గొన్నారు.

బీసీ సంఘం బలోపేతానికి చర్యలు

తిరుపతి కల్చరల్ : బీసీ సంక్షేమ సంఘం రాజకీయ శక్తిగామారుతున్న తరుణంలో గ్రామ స్థాయి నుంచి బలోపేతం కావాలని ఆ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కె.నాగరాజుగౌడ్ పిలుపునిచ్చారు. స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం శ్రీకాళహస్తి మండల కమిటీని ఏర్పాటుచేశారు. శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడిగా కోనాటి చెంచుబత్తయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా వీరరాఘవులు, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా అద్దంకి మునిశేఖర్‌కు నియామక పత్రాలు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరాచారి మాట్లాడుతూ బీసీలందరూ ఏకతాటిపైకి వచ్చినప్పుడే బలోపేతం అవుతామని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మధుమార్గాచార్యులు, బి.జయచంద్ర, జడపల్లి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనగా ఉగాది వేడుకలు



జగజ్జననికి మహా మంగళహారతిని సమర్పిస్తున్న అర్చక స్వామి





ప్రత్యేకాలంకరణలో భీమేశ్వరస్వామి, ప్రత్యేకాలంకరణలో మాణిక్యాంబదేవి



పుష్పపల్లకిపై ఊరేగుతున్న శ్రీవారి పట్టపురాణి

తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం ఉగాది ఉత్సవాలను ఘనంగా చేపట్టారు. తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారు పుష్పపల్లకిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి 8 నుంచి 8.30 గంటల వరకు పంచాంగ శ్రవణం, ఉగాది ఆస్థానం నిర్వహించారు. సూర్యనారాయణ స్వామివారి ఆలయంలోనూ ఆస్థానం నిర్వహించారు.

శ్రీనివాసమంగాపురంలో...

శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం నిర్వహించారు.

మహతిలో..

తిరుపతి కల్చరల్: టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టులు, సంక్షేమ విభాగం సంయుక్తంగా బుధవారం మహతి కళాక్షేత్రంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ సంస్కృత వర్సిటీ ఆచార్యులు వేదాంతం విష్ణు భట్టాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. ఆయనను అధికారులు శ్రీవారి ప్రసాదం, నూతన వస్త్రాలతో సన్మానించారు. అనంతరం శతావధాని ఆముదాల మురళి అష్టావధానం నిర్వహించారు. ఇందులో భరత్ శర్మ, యువశ్రీ, మాధవి, సుభద్ర, అంకమ్మ నాయుడు, ఆదిత్య శర్మ, ఇ.జి.హేమంత్‌కుమార్, హిందూ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్ రావు పాల్గొన్నారు. టీటీడీ ఉద్యోగుల పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత, సీఏవో శేషశైలేంద్ర, హిందూ ధార్మిక ప్రాజెక్టుల అధికారి విజయలక్ష్మి, టీటీడీ అర్చక శిక్షణ కోఆర్డినేటర్ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి పాదాల మండపంలో..

తిరుపతి కల్చరల్: అలిపిరి శ్రీవారి పాదాల మండపంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం ఘనంగా నిర్వహించారు. అర్చక స్వాములు శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో స్వస్తి సూక్తంతో ఆస్థానం, పంచాంగ శ్రవణం చేశారు. భోగ శ్రీనివాస మూర్తికి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్ రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, షరాబు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ శుభాలే

తిరుపతి తుడా: శోభకృత్ నామ సంవత్సరంలో అన్నీ శుభాలే కలుగుతాయని తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ప్రధాన అర్చకులు జోష్యశ్రీ రామకృష్ణ శర్మ తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం రామకృష్ణ శర్మతో పాటు బ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యులు చిత్రపు రామకృష్ణ శేషగిరిరావు, చిగోరా ఆధ్యాత్మిక సంస్థ అధ్యక్షుడు చిత్రపు హనుమంతరావును ప్రెస్ క్లబ్ కమిటీ తరఫున ఘనంగా సత్కరించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి బాలచంద్ర, ట్రెజరర్ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్, జాయింట్ సెక్రటరీ లావణ్య కుమార్, ఈసీ మెంబర్ మహేష్, పూర్వపు అధ్యక్షులు అక్షింతల నాగరాజు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లులో..

భాకరాపేట: శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగను బుధవారం చిన్నగొట్టిగల్లు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పెద్దలకు కొత్త బట్టలు పెట్టి ఉపవాస దీక్షలు ముగించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఈ యేడాది రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు.

శిల్పారామంలో..

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో బుధవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించి, పంచాంగ శ్రవణం, పచ్చడి పంపిణీ చేపట్టారు. సాయంత్రం శిల్పకళా వేదికపై శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. నాట్య గురువు కోలా పుష్ప ఆధ్వర్యంలో కళాకారులు కీర్తి, పవిత్ర, శ్రీమాన్వియ, తేజస్విని, హరుషిని, సాయి సుప్రజ, విద్యా, యవశ్రీ, సంజన, దీపిక, జన్విత్, పూజ హావభావాలతో అభినయించి ప్రేక్షకుల మన్ననలను అందుకున్నారు. వారిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

ఆర్టీసీలో ఉగాది సంబరాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో ఉద్యోగులు ఉగాది సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. తిరుపతి ఇన్‌చార్జి డిపో మేనేజర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడును సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నేతలు అర్జున్, సత్యనారాయణ, వీఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.







అష్టావధానంలో కవులు, పండితులు, పంచాంగ ప్రవచనకర్తలను సత్కరిస్తున్న ప్రెస్ క్లబ్ కమిటీ, తిరుపతి ఇన్‌చార్జి డీఎం రామచంద్రనాయుడుకు సన్మానం

అర్చకులకు రూ.5 వేలు ఉగాది పురస్కారం



అర్చకులకు ఉగాది పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

తిరుపతి మంగళం: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అర్చకులకు బుధవారం ఉగాది పురస్కారం కింద రూ.5 వేలను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష అందజేశారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఇటీవల తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయనకు ఆలయ అర్చకుల సేవలను ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి తెలియజేశారు. కమిషనర్ సూచనల మేరకు అర్చకులు మురళీస్వామి, రామకృష్ణస్వామి, సాయి స్వామికి రూ.5 వేల చొప్పున ఉగాది పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో మునికృష్ణ, సభ్యులు ధనశేఖర్, కుమార్, వెంకటేష్, కృష్ణవేణమ్మ పాల్గొన్నారు.

పాడిపంటల వృద్ధికి ప్రతీక గో సంతతి



గోవులకు పూజ చేస్తున్న ప్రతాప్ స్వామిజీ

రామచంద్రాపురం: పాడిపంటల వృద్ధికి ప్రతీకగా గో సంతతి ఉందని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామిజీ తెలిపారు. ఆయన బుధవారం గొల్లపల్లి వద్ద ఉన్న గోశాలలో గోవులకు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ మూగజీవులకు భక్తిశ్రద్ధలతో పూజలు చేయడం వలన సర్వశుభాలు కలుగుతాయన్నారు. రైతులకు వ్యవసాయంలో గోవుల పాత్ర కీలకమైనదని గుర్తు చేశారు.

బ్రాహ్మణులందరూ ఐక్యం కావాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో భీమాస్ రెసిడెన్సీలో ఘనంగా ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ వీసీ సాయి గోపాల్ పాల్గొన్నారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని ఉగాది పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులు ఐక్యం కావాలని కోరారు. స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ శోభకృత్ నామ సంవత్సర విశిష్టతను వివరించారు. ఉగాది పురస్కారాలు అందుకున్న వారిలో వేద పండితుడు శ్రీనాథన్ గానా పాఠీ, తిరుమల శ్రీవారి అర్చకుడు కాద్రి పతి, ప్రముఖ సుధా పండితుడు సుస్వరం వాది రాజాచార్, డాక్టర్ రమేష్, రెవెన్యూ అధికారి శేషగిరిరావు, రచయిత్రి వాణిశ్రీ, కిరణ్, సీనియర్ ఫొటోగ్రాఫర్ రమేష్, జాతీయ కళాకారిణి ఏఆర్.వసుప్రద ఉన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు కొత్తపల్లి అజయ్ కుమార్, వెంకటాచలం, సింగరాజు ప్రభాకర్, వేదం హరిప్రసాద్, నరసింహ ఆచార్య, కేఎస్ బాలాజీ, సంధ్యారాణి, విజయలక్ష్మి, మల్లికార్జున, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



చంద్రగిరి: వరుడి కుటుంబ సభ్యులకు పెళ్లి కానుకను అందజేస్తున్న నాయకులు



పాకాల: పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి: మండలంలోని కందులవారిపల్లి పంచాయతీ శేషాపురం గ్రామానికి చెందిన స్వర్ణమాధురి, రెడ్డిప్రసాద్‌కు వివాహం నిశ్చమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందజేసిన పెళ్లి కానుకను బుధవారం నారావారిపల్లి సీహెచ్‌సీ ఆసుపత్రి డైరెక్టర్ వినోద్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రసాద్ అందజేశారు.

పాకాల: స్థానిక భారతంమిట్ట 5వ క్రాస్‌కు చెందిన నూతన వధూవరులు అశోక్‌కుమార్, జాసితకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం అందజేశారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, సర్పంచ్ కస్తూరి, ఎంపీటీసీ స్వర్ణ, వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ రమేష్, వార్డు సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ఎంథింషా తదితరులు పాల్గొన్నారు.

ఇల వైకుంఠపురంలో..

తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆస్థానం నిర్వహించారు. ఇందులో భాగంగా టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయం లోపల, ఆలయం వెలుపల పలు పండ్లు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అలాగే గొల్ల మండపం పక్కన పౌరాణిక ఘట్టాలను అందంగా తీర్చిదిద్దారు. వీటిని భక్తులు చూస్తూ తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.

– తిరుమల



భక్తులకు నమస్కరిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి







శ్రీవారి ఆలయం వెలుపల పుష్పాలతో ఏర్పాటుచేసిన కళాకృతులు

అగర్‌బత్తీల ప్లాంట్ ప్రారంభానికి సిద్ధం

- రూ.10 కోట్లతో నిర్మించిన దాత
- రోజుకు 40 వేల ప్యాకెట్ల ఉత్పత్తి

తిరుపతి రూరల్: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవెంకటేశ్వర గోసంరక్షణశాలలో నిర్మించిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంటు, అగర్‌బత్తీల ప్లాంట్ విస్తరణ కేంద్రాన్ని ఈ నెల 31న ప్రారంభించనున్నారు. ఈ నెల మొదటి వారంలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల వాయిదా పడింది. కోడ్ ఎత్తివేసిన నేపథ్యంలో ఈ నెల 31న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించనున్నారు.

రూ.10 కోట్లతో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్

గోశాలలో ప్రస్తుతం మూడు వేలకు పైగా పశువుల ను సంరక్షిస్తున్నారు. వీటికి రోజుకు 2500 నుంచి 3 వేల కిలోల దాణా అవసరమవుతోంది. వాటి ఆరోగ్య సంరక్షణ, పాల ఉత్పత్తి పెంపు, పాలల్లో వెన్నశాతం ఉండేలా పోషకాలతో నిండిన దాణా అందించాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు. అందులో భాగంగా ఎస్వీ వెటర్నరీ వర్సిటీ సాంకేతిక భాగస్వామ్యంతో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రూ.10 కోట్లు ఖర్చయ్యే ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు దాత ముందుకు వచ్చారు. టీటీడీ పైసా ఖర్చు చేయలేదు. ఇందులో రోజుకు 4 వేల నుంచి 6 వేల కిలోల దాణా తయారు చేయవచ్చు.



అగర్‌బత్తీలు తయారు చేస్తున్న సిబ్బంది

డిమాండ్‌కు అనుగుణంగా అగర్‌బత్తీల తయారీ

టీటీడీ పరిధిలోని ఆలయాల్లో దేవుళ్ల సేవకు ఉపయోగించిన పూలతో తయారు చేస్తున్న అగర్‌బత్తీలకు దేశ, విదేశాల్లోని భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దర్శన్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో తయారు చేస్తున్న ఈ అగర్‌బత్తీలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అగర్‌బత్తీలను అందించేందుకు ప్లాంట్ విస్తరణ పనులను దర్శన్ సంస్థ చేపట్టింది. రోజుకు 40 వేల నుంచి 45 వేల ప్యాకెట్ల అగర్‌బత్తీల తయారీకి ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం రోజుకు 15 వేల ప్యాకెట్ల అగర్‌బత్తీలను మాత్రమే తయారు చేస్తున్నారు. వీటిని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చిన గంటలోనే అమ్ముడుపోతున్నాయి. అంతేకాకుండా టీటీడీ ఆలయాల నుంచి ప్రస్తుతం రోజుకు 700 నుంచి 1000 కిలోల పూలను సేకరిస్తున్నారు. పెరిగిన అగర్‌బత్తీల సామర్థ్యం మేరకు ప్రతిరోజూ 1700 కిలోల పూలు అవసరమవుతాయని టీటీడీ అధికారులు గుర్తించారు. దీంతో తిరుపతి, ఒంటిమిట్ట, నాగలాపురం, నారాయణవనం, అప్పలాయిగుంట ఆలయాల నుంచి పూలను సేకరించనున్నట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు.



పూలను ఆరబెడుతున్న మహిళలు



అమ్మకానికి సిద్ధమైన అగర్‌బత్తీలు